సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 19 । డిసెంబర్ । 2024



సోమశిలలో 72.7 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 72.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3700 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,900
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,135
3 శాతం జీఎస్టీతో	రూ.7,349
నవర (8 గ్రా)	రూ.58,792

గరిష్టం/కనిష్టం
27.1 /23.0

వాతావరణం

జిల్లాలో అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు గురువారం కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 90 శాతంగా బుధవారం నమోదైంది.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్ష సూచన



నెల్లూరు(అర్బన్): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం మరింత బలపడి రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు వైపు పయనించే అవకాశముందని అమరావతి వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఒకట్రెండు చోట్ల ఉరుములుతో కూడిన భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(క్రైమ్): నూతన ఎక్సైజ్ విధానంలో భాగంగా నగరంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులునాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టోర్ లైసెన్స్ వ్యవధి ఐదేళ్లు కాగా, తొలి ఏడాది రూ.కోటి లైసెన్స్ ఫీజు, రెండో సంవత్సరం నుంచి పది శాతం పెరుగుతుందని చెప్పారు. స్టోర్ కనీస వైశాల్యం 4000 చదరపు అడుగులు ఉంటుందని, మద్యం రూ.1200, బీరు రూ.400పైన స్టాక్‌ను మాత్రమే విక్రయించనున్నారని పేర్కొన్నారు. స్టోర్‌లో మద్యపానానికి అనుమతి లేదన్నారు. స్టోర్ ఏర్పాటుకు ఆసక్తి గల వారు apsbcl.ap.gov.in నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. నాన్ రీఫండబుల్ రుసుము కింద రూ.15 లక్షలకు డీడీ తీసుకోవాలని, పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు సమర్పించాలని సూచించారు. వివరాలకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

21న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నెల్లూరు (టౌన్) : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను శనివారం నిర్వహించనున్నామని డీఈఓ బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పోటీలు ఉదయం పది గంటలకు జరగనునున్నాయని చెప్పారు. విజేతలకు బహుమతులుగా రూ.మూడు వేలు, రూ.రెండు వేలు, రూ.1500ను అందజేయనున్నామని వివరించారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులు సమగ్ర శిక్ష ఏఎంఓను సంప్రదించి తమ పేర్లను శుక్రవారంలోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

- టౌన్‌ప్లానింగ్ విభాగంలో అంతులేని అవినీతి
- ప్లాన్ ఒకలా.. నిర్మాణం మరోలా
- నిబంధనలు పాటించని భవన యజమానులు
- అనుమతుల్లేకుండానే కట్టడాలు
- కార్పొరేషన్ ఆదాయానికి గండి

లంచాల పునాదులపై అక్రమ నిర్మాణాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న భవనాన్ని ఇస్కాన్ మందిరం ఎదురుగా ఉన్న వీధిలో నిర్మిస్తున్నారు. జీ ప్లస్ – 2కు ప్లాన్ పొంది జీ – ప్లస్ 4 తరహాలో నిర్మాణం సాగిస్తున్నారు. భవనం కింద సెల్లార్‌నూ నిర్మించారు. రెసిడెన్షియల్ కింద ప్లాన్ అనుమతి పొంది కమర్షియల్‌గా నిర్మాణం సాగిస్తున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఎలాంటి స్పందన లేదని స్థానికులు పేర్కొంటున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న నిర్మాణాన్ని బీవీనగర్ సమీపంలోని కృష్ణ మందిరం పక్కన రోడ్డుకు ఆనుకొని చేపట్టారు. భవన నిర్మాణం జరుగుతున్న స్థలానికి సంబంధించిన ఆధార కాగితాల్లేవు. పైగా రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్నారు. దీనికి నగరపాలక సంస్థ అనుమతుల్లేవు. భవనాన్ని సదరు వ్యక్తి దర్జాగా నిర్మిస్తున్నారంటే, దీని వెనుక టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఎంత మొత్తంలో అంది ఉంటుందో ఊహించుకోవచ్చు.



ఇక్కడ కనిపిస్తున్న బహుళ అంతస్తుల కమర్షియల్ భవనం బీవీనగర్‌లోని జీబీఆర్ కళాశాల సమీపంలో ఉంది. నగరపాలక సంస్థకు సంబంధించిన పార్కు స్థలమైన ఇది సుమారు 18 అంకణాలు ఉంటుంది. దీన్ని ఓ వ్యక్తి ఆక్రమించి ఇలా నిర్మాణం సాగిస్తున్నారు. ఈ విషయమై అధికారులకు స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా, ఇప్పటి వరకు ఎలాంటి చర్యల్లేవు. నగరంలో సాగుతున్న అక్రమ నిర్మాణాలకు ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే.

రాష్ట్రంలోని అతి పెద్ద నగరపాలక సంస్థల్లో ఒకటైన నెల్లూరు కార్పొరేషన్లో అవినీతి రాజ్యమేలుతోంది. ఇక్కడి టౌన్‌ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న తీరును చూస్తే విస్మయం కలగక మానదు. జోరుగా అక్రమ నిర్మాణాలు.. నిబంధనలు పాటించని భవన యజమానులు.. అనుమతుల్లేకుండా జరుగుతున్న కట్టడాలు.. ఇలా ఒక్కటేంటి.. ఎన్నెన్నో సిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ వ్యవహారం యథేచ్ఛగా జరుగుతున్నా, చోద్యం చూడటం ఆ శాఖ అధికారులు, ప్లానింగ్ సెక్రటరీల వంతవుతోంది.



నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలో ప్రత్యేక రాజ్యాంగం నడుస్తోంది. పట్టణ ప్రణాళికలో అంతులేని అవినీతి, అక్రమ వసూళ్ల పర్వం రాజ్యమేలుతోంది. నగరంలోని పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు జరుగుతున్నా, పట్టించుకునే పరిస్థితే కనిపించడం లేదు. అధికారులు కేవలం తమ జేబులు నింపుకొనే పనిలో నిమగ్నమై మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మంత్రి ఆదేశాలా.. సారీ..!

సచివాలయ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ అధికారులు కుమ్మక్కై అక్రమ నిర్మాణాలకు సహకరిస్తూ కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్నారంటూ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. ఆ విభాగంలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరిపి అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయితే ఇవేవీ తమకు పట్టదనే రీతిలో ఆ విభాగాధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతులొకలా.. నిర్మాణాలు మరోలా

నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను ఓ రకంగా తీసుకొని క్షేత్రస్థాయిలో మరో తరహాలో పనులు చేస్తున్నారు. ఇరుకు రోడ్లలోనూ భారీ భవనాలను నిర్మిస్తున్నారు. సెట్ బ్యాక్‌ను వదలడంలేదు. అనుమతులను తుంగలో తొక్కి అదనపు అంతస్తులనూ నిర్మిస్తున్నారు. సదరు యజమానుల నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారులకు నగదు ముడితే అటు వైపు కన్నెత్తి చూడటంలేదనే టాక్ నడుస్తోంది.

తనిఖీలా.. నో

నగరంలో భవన నిర్మాణాలపై నిఘా ఉంచాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు నిద్రావస్థలో జోగుతున్నారు. ఎక్కడా తనిఖీలు చేపడుతున్న దాఖలాల్లేవు. దీంతో నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే, వారి ఆదేశాల మేరకు నామమాత్రపు చర్యలు చేపట్టి, సదరు అక్రమ నిర్మాణదారుల నుంచి అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ తీరు..

150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల నెల్లూరు నగరపాలక సంస్థలో 54 డివిజన్లు ఉన్నాయి. ఇందులో 1,83,643 భవనాలున్నాయి. వీటిలో అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, షాపింగ్ మాళ్లు దాదాపు ఎనిమిది వేలకుపైగా.. బహుళ అంతస్తుల భవనాలు దాదాపు 25 వేలకు పైగా ఉన్నాయి. నెల్లో దాదాపు 20 భవనాలకు సంబంధించిన ప్లాన్ అప్రూవల్ దరఖాస్తులు కార్పొరేషన్‌కు వస్తుంటాయి. వీటిలో నిత్యం రెండు లేదా మూడు భవన నిర్మాణాలకు అనుమతులను మంజూరు చేస్తుంటారు. అయితే అనుమతుల ద్వారా కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయం కంటే టౌన్‌ప్లానింగ్ అధికారులకు అందే రాబడే ఎక్కువగా ఉంటోంది.

> **పరిశీలించి చర్యలు చేపడతాం**
>
> డీసీపీగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించా. భవన అక్రమ నిర్మాణాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకుంటున్నా. నిబంధనలను ఉల్లంఘించి ఎక్కడైనా నిర్మాణాలు జరుపుతున్నారని తెలిస్తే చర్యలు చేపడతాం. ప్లాన్ ప్రకారమే జరపాలి.
>
> – పద్మజ, డిప్యూటీ సిటీ ప్లానర్, నెల్లూరు కార్పొరేషన్

పెద్దాస్పత్రి పరిపాలనలో విఫలం

- సూపరింటెండెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం
- క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డాక్టర్లను కలుపుకొని పనిచేయడంలో విఫలమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వానికి సరెండర్ చేస్తానంటూ పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్‌పై కలెక్టర్ ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి నూతన అభివృద్ధి కమిటీ తొలి సమావేశాన్ని నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించారు. గత సమావేశ మినిట్స్ వివరాలను కలెక్టర్ ఆరాతీయగా, ఇది లేకుండా రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా తీరు మారడంలేదు.. సక్రమంగా పనిచేయకపోతే సెలవుపై వెళ్లండి.. లేదంటే తానే సరెండర్ చేస్తానని స్పష్టం చేశారు. క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా హెల్త్ సెక్రటరీకి లేఖ రాయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వివిధ అంశాలపై చర్చ

ఆస్పత్రిలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ సబ్‌స్టేషన్, సివిల్ వర్క్స్, ఆరోగ్యశ్రీ, లిఫ్టుల నిర్వహణ, ఫిజియోథెరపీ పరికరాల కొనుగోలు, స్టేషనరీ తదితర అంశాలపై చర్చించారు. రోగులకు సంబంధించిన ఓపీ, వైద్యులు సిఫార్సు చేసిన పరీక్షలు, మందులు తదితర వివరాలను రోగి తన ఫోన్లోనే చూసుకునేలా ఆన్‌లైన్లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించి డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్లు, నెట్ తదితరాలకు నిధులను విడుదల చేస్తున్నామని వెల్లడించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, డాక్టర్లు సమన్వయంతో పనిచేసి రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు.

డాక్టర్లకు అభినందన

ఆరోగ్యశ్రీలో వైద్యసేవలందిస్తూ ఎంతో ప్రగతి సాధించిన డాక్టర్లను అభినందించారు. మిగిలిన విషయాల్లో ఫలితాలు సంతృప్తికరంగా లేవని, తదుపరి సమావేశం నాటికి లోపాలను సరిచేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అనుమతులను ఆస్పత్రి చైర్మన్ హోదాలో కలెక్టర్ మంజూరు చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, సభ్యులు మొగరాల సురేష్, దారా మల్లికార్జున, బ్రహ్మానందరెడ్డి, అబీదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ ఎంపికలకు నమోదు చేసుకోండి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆన్‌లైన్లో గురువారం సాయంత్రంలోపు నమోదు చేసుకోవాలని ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాటూరు వేణుగోపాల్‌రెడ్డి, గురవయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో ఈ నెల 21 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎంపికల్లో పాల్గొనేందుకు ఈ ఎంట్రీలు తప్పనిసరని తెలిపారు. ఫెన్సింగ్ అసోసియేషన్ గుర్తింపు కలిగిన క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని, వివరాలకు 91604 34771 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చేతులెత్తేసిన ట్రబుల్ షూటర్

- గేట్‌ను పైకి లేపే యత్నాలు విఫలం



గేట్‌కు మరమ్మతులు చేస్తున్న నిపుణుడు

లింగసముద్రం: రాళ్లపాడు కుడి కాలువ గేట్‌ను పైకి లేపేందుకు ట్రబుల్ షూటర్, ప్రత్యేక నిపుణుడు పరశురామిరెడ్డి, సిబ్బంది శతవిధాలా బుధవారం యత్నించారు. అయినా గేట్ కొంచెం కూడా పైకి లేవలేదు. 20 టన్నుల సామర్థ్యం గల రెండు చైన్ బ్లాకులతో పైకి లేపేందుకు సాయంత్రం వరకు యత్నించారు. అయితే ఇవి టైటయ్యే కొద్దీ వాటికి బిగించిన చైన్లు, రోప్‌లు తెగిపోయాయి. ఈ సందర్భంగా పరశురామిరెడ్డి మాట్లాడారు. నీరు లేకుండా ఉంటేనే గేట్‌ను బయటకు తీసే అవకాశం ఉందని చెప్పారు. దీంతో ఉన్నతాధికారులతో ఎస్‌ఈ వరలక్ష్మి మాట్లాడారు. మెగా కంపెనీ వారు గురువారం వస్తున్నారని, మోటార్లతో నీరందించే చర్యలతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని రైతులకు తెలిపారు. పంట ఎండిపోకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. రాళ్లపాడు ప్రాజెక్ట్ కుడి కాలువ కింద ప్రస్తుతం 8500 ఎకరాల్లో నాట్లకు 135 క్యూసెక్కుల నీరు అవసరమవుతుందని, మెగా కంపెనీ ద్వారా 50, 75 హెచ్‌పీ మోటార్లను తెప్పించి సరిపడా నీటిని గురువారం సరఫరా చేస్తామని డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

- వెంకటాపురంలో కేసు నమోదు..?
- చిన్నారితో పాటు గర్భిణుల శాంపిళ్ల సేకరణ
- నిర్ధారణకు పుణె ల్యాబ్‌కు రక్త నమూనాలు
- అప్రమత్తమైన వైద్యశాఖ

జికా కలకలం



దోమ కాటుతో సోకే జికా వైరస్ జిల్లాలో తొలిసారిగా వెలుగుచూసిందనే సమాచారంతో కలకలం రేగింది. మర్రిపాడు మండలం వెంకటాపురంలో ఆరేళ్ల బాలుడికి సోకడం, ప్రమాదకరంగా మారడంతో చెన్నై తరలించారు. సాధారణ జ్వరం లాంటి లక్షణాలతో వచ్చే వైరస్ ఒక్కోసారి ప్రాణాంతకంగా మారనుంది. గర్భిణులకైతే మరిన్ని ఇబ్బందులు తప్పవు. ఈ పరిణామాలతో ప్రజలు భయాందోళనలో ఉన్నారు.

> **ముందస్తు చర్యలు చేపడుతున్నాం**
>
> 
>
> జికా వైరస్‌తో భయపడాల్సిన అవసరం లేదు. చిన్నారికి ఇది సోకిందని నిర్ధారణ కాలేదు. హెరిడిటరీ స్ఫెరో సైటోసిస్ అనే ఎర్ర రక్తకణాల ఆరోగ్య సమస్య ఉందని తెలిసింది. రక్త నమూనాలను సేకరించాం. చెన్నై వెళ్లినా, బిడ్డ ఆరోగ్యంపై వాకబు చేస్తూనే ఉన్నాం. ముందస్తుగా కొంతమంది గర్భిణుల రక్త నమూనాలను సేకరించాం. వీటిని పుణెలోని ప్రభుత్వ వైరాలజీ ల్యాబ్‌కు పంపుతున్నాం. ఫలితాలొచ్చాక నిర్ధారణవుతుంది. గ్రామంలో అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టాం.
>
> – పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్): ఇప్పటి వరకు ఇతర రాష్ట్రాలకే పరిమితమైన జికా వైరస్ తాజాగా జిల్లాకూ వ్యాపించిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మర్రిపాడు మండలం వెంకటాపురంలో చిన్నారికి ఈ వైరస్ సోకిందనే వార్త కలకలం రేపుతోంది. ఈ పరిణామాల క్రమంలో వైద్యశాఖ అప్రమమత్తమైంది. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశాల మేరకు వెంకటాపురం గ్రామాన్ని ఎపిడెమాలజిస్ట్ భాస్కర్, డాక్టర్ ప్రమోద్ సారథ్యంలోని వైద్యశాఖ బృందం సందర్శించింది. జికా వైరస్‌తో భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పరిసరాల్లో నీటి నిల్వల్లేకుండా చూడాలని సూచించారు. నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ.. బ్లీచింగ్ చల్లాలని పంచాయతీ అధికారులకు సూచించారు.

శాంపిళ్ల సేకరణ

జికా వైరస్ సోకిందని తెలియడంతో అక్కడి గర్భిణులు.. ఇటీవల కేరళ వెళ్లొచ్చిన టీచర్ల నుంచి రక్త నమూనాలను సేకరించారు. బిడ్డ నుంచి రక్త నమూనాలను నెల్లూరులో సేకరించారు. వీటిని పుణెలోని ప్రభుత్వ వైరాలజీ ల్యాబ్‌కు పంపే ఏర్పాట్లు చేశారు.

దోమలతో వ్యాప్తి

ఫ్లావివిరిడే కుటుంబానికి చెందిన ఫ్లావివైరస్ సోకిన డెంగీ లాంటి దోమ కుట్టడంతో ఈ వ్యాధి మనుషులకు వస్తుంది. ఈ వైరస్‌ను 1947లో ఆఫ్రికాలోని నైజీరియాలో కనుగొన్నారు. తర్వాతి కాలంలో వలసలతో ఇది ఇతర దేశాలకూ వ్యాపించింది. దోమ కాటుతో డెంగీ, మలేరియా, ఫైలేరియా తరహాలోనే ఈ వైరస్ సోకుతుంది.

జాగ్రత్త అవసరం

జికా వైరస్ సోకిన వ్యక్తికి అన్ని రకాల జ్వరాల తరహాలోనే లక్షణాలుంటాయి. దీంతో వైరస్‌ను గుర్తించడం కష్టమే. దోమలు కుట్టకుండా చూసుకోవాలి. ఇల్లు, పరిసరాల్లో నీటి నిల్వల్లేకుండా చూడాలి. దోమతెరలు వాడాలి. నిద్రించే సమయంలో దోమలు కుట్టకుండా శరీరంపై లేపనాలు రాసుకోవాలి. కిటికీలు, తలుపులకు మెష్‌లు బిగించుకోవాలి.

> **గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలి**
>
> ఈ వైరస్ సోకితే గర్భిణులకు ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. పుట్టబోయే బిడ్డ మెదడు ఎదుగుదల ఆగిపోతుంది. పొట్టిగా.. తల పెద్దదిగా పుడతారు. ఈ క్రమంలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి. దీని ద్వారా పెద్దల్లో గులియన్ బారోసింద్రోమ్ అనే వ్యాధి రావొచ్చు.

> **ఇవీ లక్షణాలు..**
>
> దోమ కాటుతో వైరస్ సోకితే ప్రధానంగా జ్వరమొస్తుంది. తలనొప్పి, శరీరంపై దద్దుర్లు, కళ్ల మంట, కళ్ల కలక, పొత్తి కడుపులో నొప్పి, అలసట, జాయింట్ నొప్పులొస్తాయి. ఇలాంటి లక్షణాలుంటే సొంత వైద్యాన్ని మాని డాక్టర్‌ను సంప్రదించాలి.

వైద్యాధికారుల పర్యటన



మర్రిపాడు: మండలంలోని వెంకటాపురంలో జికా వైరస్ కలకలం రేగడంతో వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్రస్థాయి అధికారులు పర్యటించారు. వివరాలు.. గ్రామంలోని ఆరేళ్ల బాలుడు వైరల్ జ్వరంతో 15 రోజులుగా బాధపడుతున్నారు. మర్రిపాడు పీహెచ్‌సీలో పలుమార్లు చూపించినా, జ్వరం తగ్గలేదు. అక్కడి వైద్యాధికారి సూచన మేరకు నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. బాలుడికి పలుమార్లు ఫిట్స్ రావడం.. వైరల్ ఫీవర్ తగ్గకపోవడంతో చెన్నైలోని బేబీ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. వైరల్ ఫీవర్ తగ్గకపోవడంతో జికా వైరస్ అనే అనుమానాన్ని వైద్యులు వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా వైద్య యంత్రాంగం వెంకటాపురంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర మలేరియా డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాథ్, డబ్ల్యూహెచ్‌ఓ అధికారి మౌనిక, రాష్ట్ర వైద్య కన్సల్టెంట్ కొండారెడ్డి బృందం గ్రామంలో పరిశీలిస్తున్నారు. ప్రతి ఇంటికీ వైద్య బృందం వెళ్లి ప్రజలకు పలు సూచనలు తెలియజేస్తూ దోమల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మర్రిపాడు వైద్యాధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కండలేరులో 56.656 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 56.656 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగకాలువకు 850, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

టెలికాం సలహా కమిటీ సభ్యుల నియామకం

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సిఫార్సు మేరకు జిల్లా టెలికాం సలహా కమిటీకి సంబంధిత మంత్రిత్వ శాఖ నుంచి ఆమోదం లభించినట్లు ఎంపీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆత్మకూరు నియోజకవర్గం మర్రిపాడు మండలానికి చెందిన కటారి రమణయ్య, కుందుకూరు నుంచి గుర్రం మాల్యాద్రి, నెల్లూరు రూరల్ నుంచి బొప్పూరు ప్రసాద్, కావలి నుంచి కట్టుబోయిన బ్రహ్మానందం, నెల్లూరు నుంచి ఏటూరు రమేష్‌బాబు, కోవూరు నుంచి ముంగర గోపాల్, ఉదయగిరి నుంచి తాడికొండ అనూష, నెల్లూరు రూరల్ నుంచి వెదనపర్తి సురేంద్రరెడ్డికి కమిటీలో స్థానం దక్కింది.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహం

నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలో నెల్లూరు వైపు వచ్చే రైలు పట్టాలపై మంగళవారం రాత్రి జరిగింది. మృతుడి వయసు సుమారు 30 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. బ్లూ కలర్ హాఫ్‌హ్యాండ్స్ టీషర్ట్, బ్లూ కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్సై బుధవారం తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై..

- వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: ఇనుపరాడ్‌తో ఉసిరికాయలు కోసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. నగరంలోని మూలాపేటకు చెందిన భగత్‌సింగ్‌గారి సాయి (32) ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. పొట్టేపాళెంలోని ఓ పెట్రోల్ బంకులో కొంతకాలంగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బంక్‌కు సమీపంలో ఉసిరి చెట్టు ఉంది. బుధవారం ఇనుపరాడ్‌తో కాయలు కోసేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో హైటెన్షన్ వైర్లు తగిలి సాయి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- నలుగురికి తీవ్రగాయాలు

సంగం: మండలంలోని పెరమన వద్ద జాతీయ రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు వైపు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న సిమెంట్ బల్కర్.. బద్వేల్ నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను వెంటనే 108లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. రహదారిపై ప్రమాదం జరిగిన వాహనాలను పక్కకు తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

వ్యక్తిపై పంది దాడి

- చికిత్స పొందుతూ మృతి


బాలవెంగయ్య (ఫైల్)

ఉదయగిరి: వరికుంటపాడు మండలం జి.కొండారెడ్డిపల్లి గ్రామంలోని వరి పొలం వద్ద కుమ్మిత బాలవెంగయ్య (53) అనే వ్యక్తి కాపలాగా ఉన్న సమయంలో మంగళవారం రాత్రి పంది దాడి చేసింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.25
సన్నవి	రూ.18
పండ్లు	రూ.10

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	110
లేయర్ (లైవ్)	105
బ్రాయిలర్ చికెన్	206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	226
లేయర్ చికెన్	178

'పది' గట్టెక్కేదెలా!

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. మంత్రి నారా లోకేశ్ సమస్యలను పరిష్కరించకుండా గాలికొదిలేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్జెక్ట్ టీచర్ల కొరత వేధిస్తుంటే దీనిపై దృష్టి సారించలేదు. కానీ హడావుడిగా వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను మాత్రం పంపేశారు. దీంతో ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

- హడావుడిగా వంద రోజుల యాక్షన్ ప్లాన్ పంపిన విద్యాశాఖ
- చాలా పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత
- మరికొన్నిచోట్ల ఎస్జీటీలతో బోధన
- సకాలంలో పూర్తి కాని సిలబస్
- మార్చి 17 నుంచి పరీక్షలు


పదో తరగతి విద్యార్థులు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉంది. చాలాచోట్ల సిలబస్ పూర్తి కాక పదో తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మాత్రం వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను పంపి ఈనెల ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని ఆదేశించింది. ఇందులో అదనపు తరగతులు, రోజూ స్లిప్ టెస్ట్‌ల నిర్వహణ, జవాబుపత్రాలను వెంటనే వాల్యుయేషన్ చేయడం, గ్రాండ్ టెస్ట్, ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించడం, సండేల్లో క్లాసులు, తల్లిదండ్రులతో పర్యవేక్షణ, ఎస్సీఈఆర్టీ త్వరలో విడుదల చేయనున్న మెటీరియల్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పిల్లలకు సూచనలివ్వడం తదితరాలున్నాయి. ఈనెల 11వ తేదీ నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్ – 1 పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇవి 19వ తేదీ వరకు జరుగుతాయి. ఓవైపు ఈ పరీక్షలు జరుగుతుండగానే పది యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని అధికారులు ఆదేశించడంపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

సబ్జెక్ట్ టీచర్లు ఏరీ?

సబ్జెక్ట్ టీచర్ల కొరత వేధిస్తోంది. ఉదాహరణకు వెంకటేశ్వరపురంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉర్దూ టీచర్లు లేరు. నెల్లూరులోని కేఎన్నార్ పాఠశాలలో 40 మంది టీచర్లకు గానూ 20 మందే ఉన్నారు. ప్రధానంగా మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించే టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మెజార్టీ స్కూళ్లలో ఇదే పరిస్థితి. అక్టోబర్ చివరి వారంలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. మండల, డివిజన్ స్థాయిలో మాత్రమే ఇది జరిగింది. జిల్లాస్థాయిలో జరగలేదు. కొన్ని పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేయగా, మరికొన్ని పాఠశాలల్లో సీనియర్ ఎస్జీటీలను సర్దుబాటు చేశారు. వీరికి అనుభవం లేకపోవడంతో బోధన అర్థం కాక విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. జిల్లాస్థాయిలో ఆ ప్రక్రియను చేసి ఉంటే కొన్నిచోట్లయినా సబ్జెక్ట్ టీచర్లు ఉండే అవకాశం ఉండేది.

కొరవడిన పర్యవేక్షణ

వచ్చే ఏడాది మార్చి 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నారు. అయితే సబ్జెక్ట్ టీచర్ల కొరతతో సిలబస్‌ను సకాలంలో పూర్తి కావడంలేదని తెలుస్తోంది. పాఠశాలలపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. గతంలో పనిచేసిన డీఈఓ బదిలీపై వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తూ చాలా విషయాలను గాలికొదిలేశారు. గతనెల చివరి వారంలో వచ్చిన కొత్త డీఈఓ సమావేశాలకు పరిమితమైనట్లు విమర్శలున్నాయి.

కొంతమందికే..

ఏటా జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను అందజేస్తారు. ఈసారి జిల్లా పరిషత్ హైస్కూల్స్‌ల్లో చదివే వారికి మాత్రమే పంపిణీ చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అప్పుడే పది ఫలితాలు మరింత మెరుగ్గా వస్తాయని టీచర్లు చెబుతున్నారు. పదో తరగతి మెటీరియల్ ఈనెలాఖరులో పంపిణీ చేయనున్నట్లు తెలిసింది.

జిల్లాలో పది ఫలితాలు

సంవత్సరం	ఉత్తీర్ణతా శాతం
2015 – 16	92.94
2016 – 17	94.80
2017 – 18	80.37
2018 – 19	83.19
2019 – 20	ఆల్ పాస్
2020 – 21	ఆల్ పాస్
2021 – 22	66.56
2022 – 23	75.61
2023 – 24	88.16

జిల్లాలో..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు : 340	పదో తరగతి విద్యార్థుల సంఖ్య : సుమారు 17 వేలు

యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నాం



పదో తరగతి విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ జారీ చేసిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నాం. ఇప్పటికే రెండు నెలలుగా పది విద్యార్థులకు అదనంగా తరగతులు నిర్వహిస్తున్నాం. టీచర్లను సర్దుబాటు చేశాం. సకాలంలో సిలబస్ పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఆయా మండలాల్లో ఎంఈఓలు పర్యవేక్షిస్తున్నారు.

– బాలాజీరావు, డీఈఓ

ఉపాధి పనుల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న సభ్యులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని వెంకటాద్రిపురం, చాకలికొండ, వరికుంటపాడు మండలంలోని రామాపురంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. ఐఆర్ఎస్ ఈడీ సచ్చీంద్రకుమార్ పట్నాయక్ ఆధ్వర్యంలోని సభ్యులు భూగర్భ జలాల అభివృద్ధికి చేపడుతున్న పనుల గురించి ఆరాతీశారు. గత జూలై నెలలో ఇదే బృందం పరిశీలించినప్పుడు ఉన్న నీటిమట్టానికి, ప్రస్తుతం ఉన్న దానికి సరిచూశారు. నాలుగు నెలల వ్యవధిలో జలమట్టం బాగా వృద్ధి చెందినట్లు గుర్తించారు. చెక్‌డ్యాంలు, నీటికుంటల సమీపంలో ఉన్న బోరుబావులను పరిశీలించారు. వింజమూరులో రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌తోపాటు వివిధ పండ్లతోటలను చూశారు. చాకలికొండలో గ్రామకొలను, వరికుంటపాడు మండలం రామాపురంలో చెక్‌డ్యాం, జామతోటలను పరిశీలించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మినీ గోకులాల లబ్ధిదారులతో మాట్లాడి డిసెంబర్‌లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు లోకేశ్, డి.లక్ష్మీనారాయణ, డ్వామా పీడీ గంగాభవానీ, ఏపీడీ శంకరనారాయణ, ఉదయగిరి ఏపీడీ ఆర్.గాయత్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, జలశక్తి అభియాన్ జిల్లా అధికారి శ్రీనివాసులు, ఇతర ఉపాధి సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై విస్తృత అవగాహన

- ఎస్పీ జి.కృష్ణకాంత్


కృష్ణకాంత్, ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)తో మీ ఇళ్లు భద్రం. క్రిస్మస్, సంక్రాంతి పండగల సందర్భంగా ఊర్లు, విహార, తీర్థయాత్రలకు వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి. దీనిపై పోలీస్ సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు' అని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. పండగల వేళ దొంగతనాలు జరిగే అవకాశం ఉండటంతో చోరీల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఊర్లకు వెళ్లే సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయొద్దన్నారు. గృహాల్లో విలువైన వస్తువులు, నగదు ఉంచొద్దని, బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. దొంగతనాల నిరోధానికి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 7,200 మంది ఈ యాప్‌ను రిజిస్టర్ చేసుకోగా రెండువేల మందికిపైగా వినియోగించుకున్నారన్నారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమన్నారు. ఇళ్లు విడిచి బయటకు వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా లేదా 94407 96383, 93929 03413 ఫోన్ నంబర్లకు లేదా స్థానిక పోలీసులను సంప్రదిస్తే కెమెరాలను అమర్చి ప్రత్యేక నిఘా ఉంచుతారన్నారు. తద్వారా ఇంట్లో అనుమానాస్పద కదలికలున్నా వెంటనే కమాండ్ కంట్రోల్లో సైరన్ మోగుతుందని, పోలీసులు అప్రమత్తమై చోరీలు జరగకుండా నియంత్రిస్తారన్నారు. గతంలో అనేకమంది నిందితులను పట్టుకోవడం జరిగిందన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నెల్లూరు నగరంలో ఆటోల్లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా ఈ సేవలను వివరిస్తున్నామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే డయల్ 112కు, స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలియజేశారు.


ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న సిబ్బంది

'చెల్లినే బాగా చూసుకుంటున్నారు'

- నాతో అలా ఉండటం లేదు
- తల్లిదండ్రులకు లేఖ రాసిన విద్యార్థి
- హాస్టల్ నుంచి వెళ్లిపోయిన వైనం

నెల్లూరు సిటీ: 'నా కంటే చెల్లినే బాగా చూసుకుంటున్నారు. నన్ను సరిగ్గా పట్టించుకోవడం లేదు' అంటూ 9వ తరగతి విద్యార్థి తల్లిదండ్రులకు లేఖ రాసి హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై తల్లిదండ్రులు బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. కావలికి చెందిన ప్రసాద్, వెంకటరమణమ్మ దంపతులకు కుమారుడు శ్రీను, ఒక కుమార్తె సంతానం. శ్రీను నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాళెం గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. తోటి విద్యార్థులు అక్కడ లేఖ ఉండగా చూసి టీచర్లకు ఇచ్చారు. తల్లిదండ్రులు తన కంటే చెల్లికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, తనను బాగా చూసుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంట్లో పాఠశాలకు చెందిన ట్యాబ్ ఉందని, స్కూల్లో ఇచ్చేయాలని పేరెంట్స్‌ను కోరాడు. టెన్షన్ పడొద్దని, రెండు సంవత్సరాల్లో వచ్చేస్తానని లేఖలో రాశాడు. గురుకుల పాఠశాల నిర్వాహకులు బాలుడు హాస్టల్ నుంచి వెళ్లిపోయిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో వారు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి శ్రీను ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

ఉదయగిరి అడవుల్లో మూగజీవాల వధ

- దుప్పిలను చంపారంటూ ప్రచారం

ఉదయగిరి: ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతంలో హనుమాన్ నాలా వద్ద నల్లబండ సమీపంలో రెండు మూగజీవాల కళేబరాల అవశేషాలను బుధవారం స్థానికులు గుర్తించారు. దుప్పిలను వధించినట్లుగా ప్రచారం జరిగింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి అవశేషాలను సేకరించారు. ఇవి వన్యప్రాణులవా? లేక పశువుల కళేబరాలా? అనే విషయాన్ని రెండ్రోజుల్లో తెలియజేస్తామని తెలిపారు. ఆవులను వధించి మాంసం తీసుకెళ్లి కళేబరాలను అక్కడ వేసినట్లుగా ఉందని స్థానికులు అనుమానిస్తున్నారు.

తలసేమియా బాధితులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

- వారికి ఉచితంగా బోన్‌మ్యారో శస్త్రచికిత్సలు
- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): 'తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు అండగా ఉంటాం. రెడ్‌క్రాస్ ద్వారా ఉచిత బోన్‌మ్యారో శస్త్రచికిత్సలు చేయిస్తున్నాం' అని రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని మద్రాస్ బస్టాండ్ పక్కనే ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సలు చేయించేందుకు అవసరమైన హెచ్ఎల్ఏ వైద్యపరీక్షలను ఉచితంగా చేయించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సంకల్ప్ ఫౌండేషన్ సహకారంతో ఈ పరీక్షలు చేయిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 13 సేవా ప్రాజెక్ట్‌లను నెల్లూరులో నిర్వహిస్తున్నామన్నారు. అందులో తలసేమియా ప్రాజెక్ట్ ఒకటన్నారు. ఈ వ్యాధితో బాధపడే చిన్నారులకు ఏడాదికి 1,500 ప్యాకెట్ల రక్తాన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు. బాధితులు అందరిలాగా జీవితాన్ని కొనసాగించేందుకు రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చయ్యే బోన్‌మ్యారో ఆపరేషన్‌ను ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ఇప్పటికే 8 మంది చిన్నారులకు చేయించామని, మరో 15 మందికి సర్జరీలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సీత, ప్రాజెక్ట్ కో–కన్వీనర్ పర్వీన్‌లు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. త్వరలోనే రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 20 పడకల తలసేమియా క్లినిక్‌ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. యోగా హెల్పింగ్ సొసైటీ వారు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్లు రవిప్రకాష్, సురేష్‌కుమార్ జైన్, సుబ్బారెడ్డి, రాజేంద్రప్రసాద్, సంకల్ప ఫౌండేషన్ మేనేజర్ అభిజిత్, డాక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బట్టేపాడు బాలిక.. కుస్తీలో ప్రతిభ

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక
- దాతల సాయం కోసం ఎదురుచూపులు


అర్చన

ఆత్మకూరురూరల్: పేదింటి బిడ్డ కుస్తీలో రాణిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అయితే పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేక దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది. మండలంలోని నల్లపరెడ్డిపల్లికి చెందిన పెంచలయ్య, ఆదిలక్ష్మిల కుమార్తె అయిన ఎ.అర్చన బట్టేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చిన్నతనం నుంచే క్రీడల్లో రాణిస్తోంది. ఆమె ఆసక్తిని గమనించిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కేవీ కృష్ణయ్య ప్రోత్సహించారు. దీంతో కుస్తీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపింది. నవంబర్ 9, 10, 11 తేదీల్లో చిత్తూరు జిల్లా యాదమరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొన్న అర్చన స్వర్ణ పతకం సాధించింది. దీంతో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు అండర్ – 17 కేటగిరీ 69 కేజీల విభాగంలో ఎంపికైంది. ఢిల్లీలో పొగమంచు, చలి వాతావరణం కారణంగా ఆ పోటీలు ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడగా, జనవరి మొదటి వారంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అర్చన తల్లిదండ్రులు కూలి పనులు చేస్తుంటారు. పేద కుటుంబం కావడంతో పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తోంది. ఇప్పటికే నల్లపరెడ్డిపల్లికి చెందిన దొడ్ల నరేంద్రరెడ్డి అనే దాత బాలికకు అవసరమైన క్రీడా దుస్తులు, ఇతర సామగ్రి సమకూర్చారు. నువ్వూరుపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గడ్డం శ్రీనివాసులురెడ్డి, మరికొందరు సామగ్రి అందజేశారు. అయితే కనీసం వారంరోజులపాటు ఢిల్లీలో ఉండి పోటీల్లో పాల్గొనాల్సిన నేపథ్యంలో తనకు మరింత ఆర్థిక సహకారం అవసరమని దాతలను అర్చన కోరుతోంది. చేయూతనందిస్తే జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకొస్తానని చెబుతోంది. సాయం చేయాలనుకునే వారు 98668 42282 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తల్లిదండ్రులు కోరారు.


ఇటీవల అర్చన, ఆమె తల్లి ఆదిలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణయ్యకు సన్మానం


అర్చనకు క్రీడా దుస్తులు అందజేసిన దాత గడ్డం శ్రీనివాసులురెడ్డి